క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే


పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: ఇటీవల జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరగా బుధవారం మర్యాదపూర్వకంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలుసుకున్నారు. పూల బొకే అందించి అభినందనలు తెలిపారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ రమణ పరామర్శ


సత్యంను పరామర్శిస్తున్న ఎల్.రమణ

జగిత్యాల: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ రమణ బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులున్నారు.

ఎస్పీని కలిసిన జిల్లా జైలర్


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జైలర్

జగిత్యాలజోన్: జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను జగిత్యాల స్పెషల్ జైల్ జైలర్ మొగిలేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు, ఏయే నేరాలపై జైలుకు వచ్చారనే దానిపై కొద్దిసేపు చర్చించారు.

పదోన్నతి పొందిన పీడీలకు సన్మానం


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: పీఈటీల నుంచి పీడీలుగా పదోన్నతి పొందిన పారిపల్లి గంగాధర్, కోల రాజుగోపాల్, సుజాతను రాయికల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీ కృష్ణప్రసాద్, హెచ్ఎంలు శ్రీనివాస్, రాఘవులు, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వరశర్మ, నీలి నాగరాజు, కస్తూరి శివానందం ,బేతి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు


మొక్కలు నాటుతున్న నాయకులు

కోరుట్ల: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా పట్టణ శివారులోని బీఈడీ కళాశాల వద్ద జాతీయ రహదారి పక్కన బీజేపీ నాయకులు బుధవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదవేణి మహేశ్, కౌన్సిలర్లు మాడవేణి నరేశ్, పెండెం గణేశ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు

జగిత్యాల: వైద్య విధాన పరిషత్ డాక్టర్లు, ఉద్యోగులు బుధవారం కలెక్టర్‌ను కలిశారు. జీపీఎఫ్ ఖాతాలోని నిధులను ఆ శాఖలోని అకౌంట్స్ విభాగం ఉద్యోగులు మాయం చేసిన విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో కొన్ని అవకతవకలు జరుగగా విచారణ చేసిన ఆడిటర్లే మళ్లీ చేస్తున్నారని, వారిపై తమకు నమ్మకం లేదని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేలా చూడాలని కోరారు.

పరామర్శ

మేడిపల్లి: మండలంలో ధ్యావనపెల్లి విజయ్, దామెర లక్ష్మి, బోయిని కొండయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహరావు పరామర్శించారు. ఆయన వెంట సత్తిరెడ్డి, హరిచరణ్‌రావు, ఆనంద్, ఉన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి


ధర్మపురిలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

ధర్మపురి: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా వాటి నిర్మూలనకు కలిసి కట్టుగా కృషి చేయాలని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాం నర్సింహరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులు, ఆటో కార్మికులు,స్థానికులతో మానవహారాన్ని ఏర్పాటు చేసి మత్తు పదార్థాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎస్సై ఉదయ్‌కుమార్, విద్యార్థులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బూర్ల చంద్రశేఖర్ అన్నారు. కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు వెంకయ్య, గట్టయ్య, మధుబాబు, లావణ్య తదితరులున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఏఎస్సై అంజనేయులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

వెల్గటూర్‌లో..

వెల్గటూర్ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్ అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా మండలంలోని జగదేవుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఉమాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్.ఎం.లు సురేంద్రస్వామి, రాజేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓవైసీపై అనర్హత వేటు వేయాలి


జగిత్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జగిత్యాల: పార్లమెంట్ సాక్షిగా పాలస్తీనాకు జై అన్న ఎంఐఎం అధ్యక్షుడు ఎంపీ అసదోద్దీన్ ఓవైసీని పార్లమెంట్ సభ్యుడిగా తొలగించాలని భారత సురక్ష సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఒక ఎంపీగా ప్రమాణం చేస్తూ పరాయి దేశానికి జై అన్న ఓవైసీ పై ఎంపీగా అనర్హత వేటు వేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి కాశీనాథం, పోచమల్లు, గంగాధర్, దేవరాజం, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

మల్లాపూర్: రైతు భరోసా కింద రూ.7,500 కోట్ల నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని, వచ్చే వానాకాలం సీజన్ నుంచే సబ్సిడీ విత్తనాలు, యంత్రాలు, పరికరాలు అందజేయాలన్నారు. పంటల బీమా పథకాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని, గత ప్రభుత్వం మాదిరిగానే రైతుబీమాను కొనసాగించాలని, రైతు సంక్షేమ పథకాల్లో ఎలాంటి కొతలు లేకుండా అందరికి వర్తింపచేయాలన్నారు. సమావేశంలో భారతీయ కిసాన్‌సంఘ్ ప్రధాన కార్యదర్శి ఇప్ప రాజేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు రావుల లింగారెడ్డి, మండల అధ్యక్షుడు కల్లెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

పెగడపల్లి: మండలంలోని కీచులాటపల్లి గ్రామానికి చెందిన మారుపాక లచ్చయ్య (70) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా లచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తి చెందిన లచ్చయ్య బుధవారం గుడిసెలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

లైంగికదాడి కేసులో యువకుడి అరెస్ట్

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడిన జుబేర్‌ఖా అనే యువకుడిపై రెండు రోజుల క్రితం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొననున్నారని, అధికారులు, సభ్యులు హాజరు కావాలని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని బీడీ కార్మిక సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో బేస్‌మెంట్ గోడను మున్సిపల్ సిబ్బందితో కూల్చి వేయించిన కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా చేపట్టారు. కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, చెన్నా విశ్వనాథం, హన్మంతు, సుతారి రాములు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

సీపీఐ నాయకులు తనపై చేస్తున్న అసత్య ఆరోపణలు సరికాదని స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆకాశం నుంచి 'ఫోకస్‌లైట్'



కోరుట్ల: కోరుట్లలో బుధవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఆ సమయంలో ఆకాశం నుంచి వెలుతురు ఫోకస్‌లైట్ రూపంలో కల్లూరు గుట్టపై పడ్డట్టు అరుదైన దృశ్యం కనిపించింది. సుమారు 15 నిమిషాలు అలాగే వెలుతురు కనిపించడంతో పట్టణ ప్రజలు ఆసక్తిగా చూశారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

మల్యాల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది.. బుధవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించగా, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ ఆగంతపు రవళి మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీ రవళి, ఎంపీడీవో స్వాతి గంట ఎదురుచూసినా ఎంపీటీసీలు ఎవరూ రాకపోవడంతో సమావేశం నిర్వహించేందుకు కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిళ్లు పంపిణీ

వెల్గటూర్ : మండలంలోని జగదేవుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ కొత్త సునీత సహకారంతో పాఠశాల విద్యార్థులకు రూ. 4 వేల విలువైన నోట్‌బుక్స్, పలకలు, పెన్సిళ్లు స్థానిక ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీతను ఎస్సై ఉమాసాగర్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా, వర్షకొండ, కొమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్దీపూర్, వేములకుర్తి,తిమ్మాపూర్, గోధూర్, ఇబ్రహీంపట్నం, కొజన్‌కొత్తూర్ గ్రామాల్లో 28 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం ఆడపిల్ల పెళ్లికి ఎంతో లాభం చేకూరుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కల్యాణలక్ష్మి పథకం కింద రూ. 1,00,116 తో పాటు తులం బంగారం ఇస్తామని, ఇంకా అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ కమటం భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

రాయికల్: విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రూరల్ సీఐ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం రాయికల్‌లోని ప్రణతి జూనియర్ కళాశాలలో గంజాయి నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సేవించడం, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి సేవించి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దేవేందర్, ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ రఘుపతిరెడ్డి, ప్రిన్సిపల్ శివప్రసాద్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా రవి


రవి

పెగడపల్లి: మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని రాజరాంపల్లి గ్రామానికి చెందిన సాయిని రవీందర్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మున్నూర్ కాపుల సమస్యలు, బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం పోరాటంలో భాగస్వామినై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు రవి కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్‌క్లబ్ కథలాపూర్ కార్యవర్గం

కథలాపూర్: లయన్స్‌క్లబ్ కథలాపూర్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిడుగు సంజీవ్‌రెడ్డి, కార్యదర్శిగా ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, ట్రెజరరీగాగడ్డం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్లు చిద్ర సురేశ్, గంధ్ర దిలీప్‌రావు, ప్రతినిధులు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అల్లె పరమేశ్వర్, జగదీశ్వర్‌రెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై ప్రభుత్వం స్పందించాలి



గాదెపల్లిలో భూమిని పరిశీలిస్తున్న నాయకులు

ధర్మపురి: మండలంలోని గాదెపల్లి శివారులో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వీటిపై అధికారులు, నాయకులు స్పందించాలని ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు ఆరోపించారు. గాదెపెల్లి శివారులోని భూములను బుధవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, అధికారుల అండదండలతో తప్పుడు పత్రాలు సృష్టించి కాజేశారని విమర్శించారు. ఆ భూములను నిరుపేదలకు అందించాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాడి ప్రేమ్‌సాగర్, విక్రమ్‌రెడ్డి, రైతు నాయకులు కమలాకర్‌రావు, కొండ గంగారాం తదితరులున్నారు.

క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలకు విద్యార్థులు దూరం

సారంగాపూర్: క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం సారంగాపూర్ మండలవిద్యార్థులకు బుధవారం నిర్వహించిన పోటీలకు ఒక్క విద్యార్థి కూడా హాజరు కాలేదని ఎంఈవో వాసం భీమయ్య తెలిపారు. క్రీడాపాఠశాలల్లో అడ్మిషన్ల కోసం బీర్‌పూర్ మండలంలో క్రీడలు ముగియగా, సారంగాపూర్‌లో నిర్వహించిన క్రీడలకు విద్యార్థులు హాజరుకాలేదని, ఎక్కువ మంది ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియలో ఉండడంతో విద్యార్థులు హాజరుకాలేదని, క్రీడాపాఠశాలల్లో అడ్మిషన్ల కోసం మండలంలో ఈ రెండు రోజుల్లో మరోసారి క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు.

కమ్మరిపేటలో క్షుద్రపూజల కలకలం



మేడిపల్లి: మానవాళి ప్రపంచంతో పోటీ పడుతూ అంతరిక్షంలో ఏముందో తెలుసుకోగలుగుతున్నారు. గానీ గ్రామాల్లో మూఢనమ్మకాలను జయించలేకపోతున్నారు. వరుస క్షుద్రపూజల ఘటనలతో ఉమ్మడి మేడిపల్లి మండలంలో జనాలు భయాందోళన చెందుతున్నారు. నాలుగు నెలల క్రితం భీమారం మండల కేంద్రంలో జరిగిన క్షుద్ర పూజల వ్యవహారం అప్పట్లో మండల వ్యాప్తంగా కలకలం రేపింది. ఆ సంఘటన మర్చిపోకముందే రెండు నెలల క్రితం మన్నెగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో హెడ్‌మాస్టార్ గదికి ముందు క్షుద్ర పూజలు ఆనవాళ్లు చర్చనీయాంశంగా మారింది. తాజాగా తాజాగా భీమారం మండలంలోని కమ్మరిపేటలో ఆకునూరి కిషన్ అనే వ్యక్తి ఇంటి ముందు బుధవారం తెల్లవారుజామున క్షుద్ర పూజలు కలకలం రేపాయి. నిమ్మకాయలు, బొట్టు, పసుపు, మైసంతో చేసిన బొమ్మ, వారి ఇంటి ముందు ఉండడంతో కుటుంబీకులు అవాక్కయ్యారు. ఎవరో వారి ఇంటి పై చెడు చేయడానికి ఇదంతా చేశారని వారు ఆరోపించారు. భీమారం మండలంలో జరుగుతున్న వరుస సంఘటనలపై జన విజ్ఞాన వేదిక నిపుణులు స్పందించారు. ప్రజల్లో నాటుకుపోయిన భయాన్ని పోగొట్టటానికి జన విజ్ఞాన వేదిక ద్వారా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. క్షుద్రపూజల పేరుతో కొందరు తమ పబ్బం గడుపుకోవడానికే తప్ప, దయ్యాలు, భూతాలు ఉన్నట్లు, నిరుపనగానీ, శాస్త్రీయతలేదన్నారు. నిజానికి దయ్యాలు, భూతాలు ఉంటే ముందుగా వాళ్లు వాటిని చూసి తట్టుకోగలరా జనాలు ఆలోచించాలన్నారు. ఎవరినాన క్షుద్రపూజలపై భయాందోళనలు, సందేహాలు ఉంటే జన విజ్ఞాన వేదిక నిపుణులను కలిసి కౌన్సెలింగ్ తీసుకోవాలని కోరారు. క్షుద్ర పూజల పేరిట గ్రామాల్లో భయాందోళనలు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్యాంరాజ్ హెచ్చరించారు.

దళిత జ్ఞానోధారకుడు ఛత్రపతి సాహు మహరాజ్

జగిత్యాలరూరల్: దళిత జ్ఞానోద్ధారకుడు ఛత్రపతి సాహు మహరాజ్ అని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకుతోట వెంకటరమణా రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మారంలో బుధవారం ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్త, రిజర్వేషన్ల పితామహుడు, బడుగు బలహీన వర్గాలు, పేదల పాలిటి పెన్నిధి మహరాజ్ జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దళితులకు జ్ఞానాన్ని ప్రసాదించిన గొప్ప రాజు సాహు మహరాజ్ అన్నారు. అంబేడ్కర్‌కు ఆర్థిక సాయాన్ని అందించడమే కాకుండా, పూలే అడుగు జాడల్లో నడుస్తూ మహిళలకు చట్టపరమైన హక్కులు, దళిత బహుజనుల్లో విద్యా వ్యాప్తి కోసం మహరాజ్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గోస్కుల గంగాధర్, లింగారెడ్డి, సమరసత జిల్లా గౌరవ అధ్యక్షుడు కానికారం లచ్చన్న, ప్రధాన కార్యదర్శి సోమిరెడ్డి భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపుల వేలం

ధర్మపురి: ఇసుక డంపుల వేలం పాటకు రూ.5,40,600 ఆదాయం సమకూరినట్లు తహసీల్దార్ కృష్ణచైతన్య తెలిపారు. మండలంలోని రాయపట్నం వంతెన వద్ద నిలువ ఉంచిన 300 ట్రిప్పుల ఇసుక డంపులను ఇటీవల మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించగా, రాయపట్నంకు చెందిన బొప్పు శ్రీకాంత్ రూ.5,40,600 లకు దక్కించుకున్నాడని తెలిపారు.

విద్యుత్ స్తంభం సరిచేశారు..



మల్లాపూర్: మండల కేంద్రం శివారులోని మెట్‌పల్లి రహదారిలో వంగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభానికి విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతు చేశారు. 'పడిపోతే ప్రమాదం' శీర్షికన సాక్షిలో ప్రచురించిన ఫొటో స్టోరీకి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఏఈ వినీత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి స్పందన

'కార్యదర్శుల డుమ్మా'పై అధికారుల ఆరా

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు అనుమతులు లేకుండా విధులకు డుమ్మా కొట్టడంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. సాక్షిలో మంగళవారం ప్రచురితమైన 'విధులకు డుమ్మా కొట్టిన కార్యదర్శులు' అనే కథనంపై విధులకు హాజరుకాని కార్యదర్శులను అధికారులు సంజాయిషీ కోరినట్లు తెలిసింది.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు

కథలాపూర్: వాగుల్లో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కోరుట్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి శివారులో బుధవారం వాగును పరిశీలించారు. వాగులో నుంచి అక్రమంగా ఇసుకను కోరుట్ల పట్టణానికి తరలిస్తుండటంతో అధికారులతో చర్చించారు. వాగు సమీపంలో కందకాలు తవ్వి అటువైపు వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఆర్ఐ రాహుల్ ఉన్నారు.


ఘనంగా తాతమ్మ బోనాలు

మల్లాపూర్: మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ, శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తాతమ్మకి బోనాలు సమర్పించారు. బుధవారం గ్రామంలోని ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, మహిళలు ఊరేగింపుగా డప్పుచప్పుళ్లు, భక్తుల మధ్య బోనాలతో తరలివచ్చి తాతమ్మకి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేష్, మరిపెల్లి సత్తెమ్మ, వీడీసీ చైర్మన్ గంగరాజం, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు మరిపెల్లి మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.